ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం



ఇవిఎంల గోదాము పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు నిల్వ ఉండే గోదామును త్రైమాసిక పరిశీలనలో భాగంగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఎలక్ట్రోరల్ సిబ్బందిని ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. గార్డు రూమ్‌ను పరిశీలించి సిసి కెమెరాలు పనిచేస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, కాంగ్రెస్ నాయకులు డి.గోవింద మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు తగ్గాయి కానీ...

- ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు పెరిగాయి
- దొంగతనాలు కూడా...
- తగ్గిన రోడ్డు ప్రమాదాలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గత రెండేళ్లతో పోలిస్తే నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు, దొంగతనాలు, ఆత్మహత్యలు పెరిగాయి. అగ్ని ప్రమాదాల్లో మృత్యువాత, కాలిపోవడంలోనూ పెరుగుదల కనిపిస్తోంది. మహిళలపై నేరాలు తగ్గడం కొంత ఉపశమనం కలిగిస్తోంది. పోక్సో చిన్న పిల్లలపై లైంగిక నేరాలు తగ్గాయి. వైట్ కాలర్ నేరాలు తగ్గుముఖం పట్టాయి. మిస్సింగ్ కేసుల నమోదూ తగ్గాయి.

జిల్లాలో 2021, 2022తో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గింది. 2021లో 5,022 కేసులు నమోదు కాగా, 2022లో 5,071 కేసులు నమోదయ్యాయి. 2023లో 4,618 కేసులు నమోదయ్యాయి. ఈ సంవత్సరం మహిళలపై దాడులు 18 శాతం మేర తగ్గాయి. గతేడాది 597 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 506 నమోదయ్యాయి. ఎస్‌సి, ఎస్‌టిలపై 2022లో 56 కేసులు రాగా 2023లో 64 వచ్చాయి. 2022లో 434 మంది ఆత్మహత్యకు పాల్పడగా ఈ ఏడాది 482 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. వైట్ కాలర్ నేరాలు 11 శాతం మేర తగ్గాయి. గతేడాది 242 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 219 కేసులు దాఖలయ్యాయి. ఆస్తి దొంగతనాలు 2022లో 252 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 267 వెలుగు చూశాయి. హత్య కేసులు 2022లో 24 నమోదు కాగా ప్రస్తుతం 25 నమోదయ్యాయి. కిడ్నాప్ కేసులు తగ్గుముఖం పట్టాయి. గతేడాది ఎనిమిది నమోదు కాగా, ఈ ఏడాది ఆరు నమోదయ్యాయి.

మహిళలు, చిన్నారులపై నేరాలు తగ్గుముఖం

మహిళపై పలురకాల వేధింపులకు సంబంధించి 2022లో 597 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 506 కేసులు నమోదయ్యాయి. ఇందులో వరకట్న వేధింపు మరణాలు 2022లో రెండు నమోదు కాగా, ఈ ఏడాది మూడు నమోదయ్యాయి. మహిళలను ఆత్మహత్యకు పురిగొల్పడంపై రెండు సంవత్సరాల్లోనూ 12 చొప్పున నమోదయ్యాయి. వరకట్న వేధింపు నేరాలు కొంత తగ్గాయి. 2022లో 362 నమోదు కాగా 2023లో 351 నమోదయ్యాయి. ఈ ఏడాది ఆత్యాచారం కేసు ఒకటి నమోదైంది. నమ్మించి మోసం చేసిన కేసులు గతేడాది 25 నమోదు కాగా, ఈ ఏడాది ఏడు వెలుగు చూశాయి. పోక్సో చిన్న పిల్లలపై లైంగిక నేరాలకు సంబంధించి 2022లో 46 నమోదు కాగా ఈ ఏడాది 36 నమోదయ్యాయి.

పెరిగిన గంజాయి, మాదకద్రవ్యాల రవాణా

గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఈ ఏడాది జోరుగానే సాగింది. 2022లో 11 కేసులు నమోదు కాగా, 2023లో 19 కేసులు నమోదయ్యాయి. పేకాట నేరాలు బాగా పెరిగాయి. గతేడాది 209 నమోదు కాగా, ఈ ఏడాది 273 నమోదయ్యాయి. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఓవర్ లోడ్ కేసులు మూడున్నర రెట్లు పెరిగాయి. 2022లో 577 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 2005 కేసులు వెలుగు చూశాయి. ఖైనీ, గుట్కా అక్రమ రవాణా కొంతమేర తగ్గాయి. 2022లో 104 నమోదు కాగా, ఈ ఏడాది రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకున్న చర్యలు కొంతమేర సత్ఫలితానిచ్చాయి. క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు, జాతీయ రహదారిపై ముఖ్య కూడళ్ల వద్ద పోలీసులను విధులకు నియమించడం, అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు, బ్లాక్ స్పాట్స్ గుర్తించడంతో వంటి చర్యలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఎక్కువగా నమోదు చేయడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. గతేడాది 814 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, 273 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఏడాది 793 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 282 మంది చనిపోయారు.

సమిష్టి కృషితో నేరాలు అదుపు : ఎస్‌పి రాధిక



పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో నేరాలను కట్టడి చేయగలిగామని ఎస్‌పి జి.ఆర్ రాధిక చెప్పారు. ఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు పలురకాల కౌన్సెలింగ్‌లు నిర్వహించడం, నేరాలపై అవగాహన సదస్సులు, ముందస్తు నిఘాతో పాటు సమాచార సేకరణ ద్వారా గతేడాది పోలిస్తే నేరాలు బాగా తగ్గించగలిగామన్నారు. జిల్లావ్యాప్తంగా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ఈ ఏడాది 1,637 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఇబి, పోలీస్ శాఖల సమన్వయంతో మద్యం, ఇసుక, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల ఏర్పాటు, దాడులతో అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు చాలావరకు తగ్గించామని చెప్పారు. జిల్లాలో ప్రత్యేకంగా కళాశాల విద్యార్థుల కోసం 'క్యాంపస్ కాప్స్', ప్రభుత్వ వసతిగృహ విద్యార్థుల కోసం సీనియర్ సిటిజన్లతో ఏర్పాటు చేసిన 'చిన్నారికి చేదోడు' కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా జ్యుద్ది వాలంటీర్లను నియమించి, విలేజ్ కమిటీల ద్వారా గ్రామాల్లో నేరాల నివారణకు చర్యలు చేపట్టామని వివరించారు.

ప్రశాంతంగా కొత్త సంవత్సర వేడుకలు చేసుకోవాలి

ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్‌పి సూచించారు. ప్రధాన రహదారి మార్గాల్లో మద్యం సేవించి వాహనం నడపడం, ప్రజలకు ఇబ్బందికరంగా బహిరంగ ప్రదేశాల్లో డిజె సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎవరి పక్షం?

జీడికి మద్దతు ధర ప్రకటించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ప్రభుత్వం జీడి రైతుల పక్షం వహిస్తుందా? దళారుల పక్షం వహిస్తుందో స్పష్టం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఎన్.గణపతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పలాస వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీడిపిక్కలకు మద్దతు ధరపై ఒక మాట కూడా చెప్పకపోవడం శోచనీయమన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ఏడాదిగా జీడి రైతులు మద్దతు ధరకు పలురూపాల్లో పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. లక్ష సంతకాలతో సిఎంకు వినతిపత్రం ఇస్తే చర్చిస్తామని హామీనిచ్చినా, చర్చలు ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అండతో జీడి యాజమాన్యాలు సిండికేట్‌గా మారి తక్కువ ధర ఇచ్చి జీడి రైతులను దోచుకుంటున్నాయని వారు విమర్శించారు. విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం జీడిపిక్కలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. స్థానిక మంత్రి అప్పలరాజు జీడి గిట్టుబాటు ధరపై ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర చెల్లించి, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలని, కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, స్థానిక రైతుల నుంచి పిక్కల కొనుగోలు చేశాకే విదేశీ పిక్కల దిగుమతికి అనుమతించాలన్నారు.

కళ్లు మూసుకొని పనిచేస్తున్నారా?

అధికారులపై స్పీకర్ సీతారాం ఆగ్రహం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతుల నుంచి క్వింటాకు 5 నుంచి 7 కేజీలు అదనంగా తీసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. ఈ పద్ధతి మంచిది కాదని, అధికారులు కళ్లు మూసుకొని విధులు నిర్వహిస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాల శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. రైతుభరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ చేసుకున్న రైతులు పండించిన పంటను ఇప్పటివరకు ఎన్ని మెట్రిక్ టన్నులు సేకరించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపానుతో తడిసిన ధాన్యాన్ని మానవతా దృక్పథంతో కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి పరిమితుల్లేవని, వీలున్నంత వరకు ఎక్కువగా ధాన్యం కొనుగోలు చేసేలా చొరవ చూపాలన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల, వ్యవసాయశాఖ అధికారులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధిపై చర్చకు సిద్ధమే...

- మంత్రి అప్పలరాజు సవాల్‌ను స్వీకరిస్తున్నా
- అబద్ధాలతో వైసిపి గ్లోబల్ ప్రచారం
- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో ఉత్తరాంధ్ర, జిల్లా అభివృద్ధిపై చర్చకు రావాలన్న మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ఎంపీ కింజరాపు రామ్మోహన్ తెలిపారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూట్యూబ్‌లో లైక్‌ల కోసం మంత్రి అలాంటి కామెంట్లు చేస్తుంటారని చెప్పారు. పోర్టు నిర్మాణాన్ని స్వాగతిస్తున్నామని, వ్యక్తిగత స్వార్థంతో ముడుపులు అందుకుని మధ్యలో వదిలేస్తే ప్రజలు క్షమించరన్నారు. నాలుగున్నరేళ్లుగా అబద్ధాలను గ్లోబల్ ప్రచారం చేస్తూ వైసిపి నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఏటా జాబ్ కేలండర్ ప్రకటించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నిరుద్యోగులను నయవంచనకు గురిచేశారని ధ్వజమెత్తారు. మద్యపాన నిషేధం అని హామీనిచ్చి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానన్న జగన్ గానీ, వైసిపి ఎంపీలు గానీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలోనూ మాట్లాడడం లేదన్నారు. దాచుకుందాం, దోచుకుందామనే యావ తప్ప అభివృద్ధి జాడే లేదన్నారు. సామాన్యులపై పన్నుల రూపంలో మోయలేని ఆర్థికభారం మోపుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, టిడిపి నాయకులు సింతు సుధాకర్, పి.ఎం.జె బాబు తదితరులు పాల్గొన్నారు.

42,386 మందికి విద్యా దీవెన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలో 42,386 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.27.45 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. నాలుగో విడత జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన ప్రభుత్వం బిడ్డ పుట్టిన దగ్గర నుంచి విదేశీ విద్య వరకు పలు పథకాలను అందజేస్తోందన్నారు. జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 42,386 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులు జమ చేసినట్లు చెప్పారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.


నమూనా చెక్కును అందజేస్తున్న జెసి నవీన్

కుష్టు వ్యాధి నివారణే ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


కుష్టు వ్యాధి నివారణే ధ్యేయంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు వ్యాధి గుర్తించే కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని జెసి ఛాంబరులో వైద్యాధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల పాటు ఇంటింటా సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు 2,224 బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామంలో రోజుకు 20 చొప్పున, పట్టణ పరిధిలో 50 చొప్పున ఇంటింటా సర్వే చేసి స్పర్శ లేని తెల్లని మచ్చలను గుర్తించి సంబంధిత వైద్యాధికారికి చూపించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 219 కేసులు ఉన్నాయన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, కుష్టు నివారణాధికారి అనురాధ, డెమో పైడి వెంకటరమణ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాధారణ ఎన్నికల నిర్వహణకు సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి హరీందర్‌తో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనవరి 22న పూర్తిస్థాయి ఓటర్ల జాబితా ప్రచురణ ఉందని, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎటువంటి లోటుపాట్లకు తావీయకుండా చూడాలన్నారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇవిఎంలతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే ప్రతి మెటీరియల్‌నూ మైక్రో ప్లాన్‌కు అనుగుణంగా సిద్ధం చేసుకున్నామని వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల వంటావార్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెగ్యులరైజ్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి అధ్వర్యాన సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి పదో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా స్థానిక జ్యోతిరావుపూలే పార్కు వద్ద ఉద్యోగులు వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ సందర్శించి సంఘీబావం తెలిపారు. ఎంపీకి సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, పి.వాగ్దేవి, రవీంద్ర, ఫెడరేషన్ జెఎసి అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తవిటినాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

క్రీడలతో మానసికోల్లాసం సాధ్యమని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్డ్ పోలీస్ మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బంది వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. క్రీడల్లో ఆర్మ్డ్ పోలీస్, హోంగార్డులు, శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా స్పోర్ట్స్‌మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్‌కు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు వి.ఎన్ మణికంఠ, టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు వై.శృతి, సిహెచ్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అండగా మేమున్నాం

- అంగన్వాడీల పోరాటానికి మద్దతుగా కార్మిక, ప్రజాసంఘాల ధర్నా
- చెవిలో పువ్వులతో అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

అంగన్వాడీల పోరాటానికి అండగా ఉంటామని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు భరోసానిచ్చారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 18వ రోజుకు చేరింది. అంగన్వాడీల పోరాటానికి మద్దతుగా కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని 18 రోజులుగా అంగన్వాడీలు రోడ్డెక్కినా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీలపై బెదిరింపు ధోరణి మానుకొని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా అనేక సేవలందిస్తున్న అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తానన్న ముఖ్యమంత్రి హామీ నెరవేరలేదన్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలని 2022లోనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా మన రాష్ట్రంలో అమలు చేయడం లేదని విమర్శించారు. ధర్నాకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఉదాసీన వైఖరిని వీడి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుతో అంగన్వాడీల కుటుంబాలతో పాటు కేంద్రాల్లోని చిన్నారులు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.కిషోర్ కుమార్, చౌదరి రవీంద్ర, విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు టి.త్రినాథ్ సంఘీభావం తెలిపారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి డి.గణేష్, ప్రజా సంఘాల నాయకులు బి.కృష్ణమూర్తి, కె.సూరయ్య, వరదరాజు, ఎ.సత్యనారాయణ, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

కోటబొమ్మాళి, కొత్తూరులో అంగన్వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి డి.సుధ, కె.లక్ష్మి, జలజాక్షి, వ్య.కా.స నాయకులు సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పలాసలో సమ్మెకు యుటిఎఫ్ జిల్లా కార్యర్శి బి.చిట్టిబాబు సంఘీభావం తెలిపి రూ.ఐదు వేలు ఆర్థికసాయం అందజేశారు.కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బి ఓంకార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజుల, బి.సునీత తదితరులు పాల్గొన్నారు. పొందూరులో నిరాహార దీక్ష చేపట్టారు. యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, ఎం.లత తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, రైతుసంఘం నాయకులు పి.సాంబమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.రమణమ్మ, బి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అడ్డగింత

ఇచ్ఛాపురం మండలం పురుషోత్తపురం అంగన్వాడీ కేంద్రాన్ని సచివాలయ ఉద్యోగులు తెరిచారు. విషయం తెలుసుకున్న అంగన్వాడీలు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీ నారాయణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక కార్యదర్శి కె.అప్పారావు, స్థానికులు అక్కడకు చేరుకున్నారు. అంగన్వాడీలు లేకుండా కేంద్రాన్ని ఎందుకు తెరుస్తారని స్థానికులు వారిని నిలదీశారు. దీంతో కేంద్రాన్ని మూసివేసి సచివాలయ ఉద్యోగులు వెళ్లిపోయారు.


ఇచ్ఛాపురం : సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న స్థానికులు,


కోటబొమ్మాళి : చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

ఎంత చెప్పినా మార్పు రాదా..?

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రెండురోజుల క్రితం తనిఖీలు చేసి ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి అప్పలరాజు మళ్లీ ఆస్పత్రికి చేరుకుని వైద్యుల కోసం ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్యుడు రఘురాం, అరుణ, గీతరాణిలు ఉండటంతో మిగిలిన వారెక్కడని ప్రశ్నించారు. దీంతో సూపరింటెండెంట్ బాధ్యతలు చూస్తున్న సుశీల జిల్లా కేంద్రంలో జరిగే సమావేశానికి వెళ్లారని, మిగిలిన వారంతా సెలవులో ఉన్నారని, కిరణ్ డేఆఫ్ ఉన్నారని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. మంత్రి మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డిసిహెచ్‌ఎ పరిధిలో ఉంటారు కదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమావేశానికి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. వైద్యులకు ఎంతెంత జీతాలు వస్తున్నాయి, క్యాజువాలిటీలో ఉండే రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని రోగులకు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో వైద్యులకు ఎంత చెప్పినా మార్పు రావటం లేదని వైద్యుల గదుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈయనతో పాటు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఎఎంసి చైర్మన్ పివి సతీష్, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- బూర్జ

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలం ఉప్పినివలస గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలు అందుతున్నాయో లేదా అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్, మండల సచివాలయల కో-ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, మండల పార్టీ కన్వీనర్ ఐ.వెంకటరావు, స్థానిక ఎంపిటిసి, మండల వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- కవిటి

మండలం కుసుంపురం గ్రామంలో ఎన్ఆర్‌జిఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వీరు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, ప్రజలు వీటిని ఉపయోగించుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి చైర్మన్ బాబురావు, వైస్ చైర్మన్ నీలయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, సర్పంచ్ ఊర్మిళ, శివ బిసాయి, ఎంపిటిసి కర్రి పద్మ, పిఎం తిలక్ పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో విజేతలుగా నిలవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయస్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటి విజేతలుగా తిరిగిరావాలని జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లు పిలుపునిచ్చారు. పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ స్థాయి పోటీలకు బయలుదేరే ఇద్దరు ఫెన్సింగ్ క్రీడాకారులు కలెక్టర్, జెసిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈఏడాది ఆగస్టులో భీమవరంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకి చెందిన సంపతరావు గౌతమ్ చంద్ర (సాబర్ విభాగం), సాహుకారి మురళీకృష్ణ (ఇప్పి విభాగం) నుంచి తమ ప్రతిభను కనబరిచి పతకాలను సాధించారు. ఈ నెల 31 నుంచి జనవరి 3 వరకు చత్తీస్ గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరుగనున్న పోటీలకు వెళ్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన కేంద్ర ప్రభుత్వ అధికారి


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పిఎం జన్మన్ ప్రభాహరి కార్యక్రమాన్ని పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక అధికారి బిస్మితా నగరంలో ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకున్నారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్‌తో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛాన్ని కలెక్టరు అందజేసి జిల్లాలో గిరిజనుల జీవన స్థితిపై పలు అంశాలను చర్చించారు. అనంతరం ఆమె బయలుదేరి సీతంపేట వెళ్లారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం డిఎస్‌పి వై.శృతి రికార్డులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న సంక్రాంతి పండుగకు గ్రామాల్లో జరిగే కోడి పందాలు, జూదం, పేకాట, మద్యం అమ్మకాలపై దృష్టి సారించాలన్నారు. కేసులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. స్టేషన్‌లో సిసి కెమేరాల పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో క్రైమ్ రేట్‌ను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఐకు సూచించారు. ఈమె వెంట సిఐ ఎస్. ఆదాం, ఎస్ఐ రామారావు, సిబ్బంది ఉన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి శృతి

మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతం


శ్రీకాకుళం అర్బన్ : శిబిరం వద్ద మాట్లాడుతున్న తేజేశ్వరరావు


ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని చెప్పి చర్చల పేరుతో తాత్సారం చేస్తున్నారని, చర్చలు విఫలం కావడంతో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాదయాత్రలో అసెంబ్లీ సాక్షిగా జగన్ ఇచ్చిన హామీలు అమలుకై నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులంతా విధులు బహిష్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి తేజేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆముదాలవలస, ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో కార్మికులంతా సమ్మెలో భాగస్వాములై ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ ఏడు ప్రకారం క్లాప్ ఆటోలో డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణ రాజు, అర్‌జి రాము, ఎ.రాజేష్, టి.వెంకటలక్ష్మి, టి.మల్లమ్మ, మాధవి, మోహన్, డి.యుగంధర్, ఎం.నారాయణరావు, డి .సురేష్ కుమార్, అప్పన్న పాల్గొన్నారు.

ఆముదాలవలస: తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వరకు తాడి సంతోష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు జె.శ్రీనివాస్, కె.ఈశ్వరరావు, జె.వాసు, కె.తారకేశ్వరరావు, ఎన్.రాజేష్, కార్మికులు పాల్గొన్నారు.

పలాస: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నాలుగోరోజు నిరవధిక


ఇచ్ఛాపురం : భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు


పలాస : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మె చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ నియోజకవర్గ నాయకులు చాపర వేణుగోపాల్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మురగన్, యం.రవి, యూనియన్ నాయకులు దివాకర్, యస్.శంకర్, తిరుపతి, ప్రకాష్ ముఖి, సీతమ్మ, గులాబీ, సావిత్రి, లక్ష్మీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కారం చేసేవరకు సమ్మె కొనసాగుతుందని సిఐటియు కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్ అన్నారు.

యుటిఎఫ్ కేలండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక హరిపురం పాఠశాలలో శుక్రవారం ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కేలండర్లు, పాకెట్ కేలండర్లు, డైరీలు, ఇతర ప్రచురణలను యుటిఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఇఒ లక్ష్మణరావు, హెచ్‌ఎం జి.ఉమారాజు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రచురిస్తున్న కేలండర్లు, డైరీలు, ఎస్ఎస్‌సి మోడల్ టెస్ట్ పేపర్లు విద్యార్థి లోకానికి విలువైన సమాచారం అందించేవిగా ఉంటున్నాయని కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. జనవరి 3న జిల్లా కేంద్రంలో, 9, 10 తేదీల్లో విజయవాడలో యుటిఎఫ్ పోరుబాట కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, పూర్వ జిల్లా కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, కోశాధికారి సోమనాథ్ సిష్టు, పూర్వ ప్రధాన కార్యదర్శిలు సోమేశ్వరరావు, కె మాధవరావు, సీనియర్ కార్యకర్తలు లండ రాజారావు, జన్ని సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

కంచిలి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2024 నూతన సంవత్సర కేలండర్, డైరీలను సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఎంఇఒలు ఎస్.శివరామ ప్రసాద్, కె.చిట్టిబాబు చేతులమీదగా కేలండర్లతో పాటు డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ మెంబర్ సుదర్శన్ బెహరా, అధ్యక్ష కార్యదర్శులు మురళీనాయక్, ఎన్.రవి, గౌరవ అధ్యక్షులు త్రినాధ్ సాహు, కోశాధికారి త్రినాధ్, ఎస్. వెంకటరావు, పి.పురుషోత్తం రెడ్డి, నిరంజన్, భాస్కర్ పాల్గొన్నారు.


సోంపేట : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

నందిగాం: యుటిఎఫ్ కేలండర్‌ను విద్యాశాఖాధికారి జి.నరసింహులు, చిన్నవాడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.హరిబాబు, సిహెచ్ కృష్ణారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శంకరరావు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమారస్వామి, గణపతిరావు ఉన్నారు.

చంద్రబాబుతోనే ఎస్‌సి, ఎస్‌టిలకు న్యాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అంబేద్కర్ ఆశయ సాధనకు చంద్రబాబు సిఎం అయితే సాధ్యమని నెల్లూరుకు చెందిన చింతల అశోక్ కుమార్ అన్నారు. సిఎంగా చంద్రబాబునాయుడు విజయం సాధించాలని ఇచ్ఛాపురం నుంచి తమిళనాడు సరిహద్దు తడ వరకు, అక్కడ నుంచి తిరిగి తిరుమల వరకు 12వందల కిలోమీటర్ల పాదయాత్రకు ఇచ్ఛాపురంలో శ్రీకారం చుట్టారు. పురుషోత్తపురం సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఎమ్మెల్యే బెందాలం అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ కుల భాగస్వామ్యం, ఆర్థికంగా, సామాజిక అభివృద్ధికి ఎన్నో వినూత్న పథకాలు టిడిపి హయాంలోనే జరిగిందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 27 ఎస్‌సి సంక్షేమ పథకాలను రద్దు చేసిన దళిత ద్రోహి జగన్ అని విమర్శించారు. ఎమ్మెల్యే అశోక్ బాబు మాట్లాడుతూ ఈ అరాచకపాలన అంతం కాక తప్పదని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలిన ఢిల్లీ, నందిక జాని, కాళ్ల దిలీప్ కుమార్, లీలారాణి, పత్రి తవిటయ్య, కోటేశ్వరరావు, సహదేవ్ రెడ్డి, కామేశ్వరరావు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఉదయ్ కుమార్

రహదారి పనులు ప్రారంభం


ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గరుడభద్ర పంచాయతీ టి.గడూరు రెవెన్యూ పరిధిలో కోనేరు జోగులు తోటమీదుగా లడభంద చెరువు వరకు రహదారి పనులను ఎంపిపి ప్రతినిధి ఉదయ్ కుమార్ శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. గ్రావెల్ రోడ్ నిర్మాణం కోసం రూ.2 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ పరిధిలో ఆరు గ్రావెల్ రోడ్లు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన రహదారులను స్థానిక మంత్రి అప్పలరాజు, ఎంపిపి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌ల సహకారంతో పూర్తిచేసి పంచాయతీని అన్నివిధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎ.దానేష్, ఉప సర్పంచ్ ఎం.పార్వతి, ఎస్.జగ్గారావు, ఆర్.భాస్కరరావు, జి.భాస్కరరావు, ఎం.కూర్మారావు, పి.భీమారావు, ఎపిఒ కేశవరావు, ఉపాధిహామీ మేట్లు జి.హైమావతి, కె.నీలవేణి పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో పాటు భవితా కేంద్రాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల భవిత కేంద్రాల ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ గేదెల కిరణ్‌కుమార్ అన్నారు. పిజియోథెరపిస్ట్‌గా డాక్టర్ గేదెల కిరణ్‌కుమార్ శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పిజియోథెరపీ సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌టి దేవమణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్సీ రామారావు

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే...

కవిటి: గ్రామీణ ప్రాంత యువకుల్లో విశేషమైన ప్రతిభ దాగివుందని, వారిలో ఉన్న నైపుణ్యం వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు. లండారిపుట్టుగలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎమ్మెల్సీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వాలీబాల్, క్రికెట్ ఆటలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- పోలాకి

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిసిసెల్ జోనల్ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులతో గడిచిన మూడు నెలలు చేసే పనులపై చర్చించారు. ఈ సందర్భంగా పంచాయతీశాఖ అధికారులపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. జడూరు, ఎస్ఎల్ పురం, బెలమర, గుప్పిడిపేట, బొద్దాం, ఉరజాం పంచాయతీల సర్పంచ్‌లు చేసిన పనులకు సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చేసిన పనులకు ఎంబుక్ నమోదు చేయడంలో కూడా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అలాగే మత్యకారులకు ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, ఉప ఎంపిపి కె.తాతారావు, తహశీల్దార్ కె.శ్రీరాములు, ఎంపిడిఒ ఉషశ్రీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

మత్స్యకారుల ద్రోహి అప్పలరాజు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మత్స్యకార కోటలో ఎమ్మెల్యే, మంత్రి పదవి దక్కించుకున్న సీదిరి అప్పలరాజు మత్స్యకారులకు ద్రోహం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. మందస మండలం బేతాళపురం గ్రామంలో శుక్రవారం అగ్ని కులక్షత్రియుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా ఉంటామని చెప్పిన మంత్రి సీదిరి అప్పలరాజు తన సామాజిక వర్గానికి చెందిన వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ల పేటకు చెందిన సుమారు 250 కుటుంబాలకు రాజకీయం పేరుతో మత్స్యకారుల భరోసా రాకుండా అడ్డుకోలేదా అని ప్రశ్నించారు. తన తండ్రి మాజీ మంత్రి గౌతు శివాజీ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి మత్స్యకారులకు మత్స్యకారుల భరోసా ఇప్పించారని గుర్తు చేశారు. మత్స్యకారులకు టిడిపి నిత్యం అండగా ఉంటుందని హామీనిచ్చారు. రాబోయే రోజుల్లో టిడిపిని గెలిపించాలని, తద్వారా చంద్రబాబును సిఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అగ్ని కులక్షేత్రియుల అధ్యక్షుడు గొరకల వసంతస్వామి, జుత్తు కూర్మారావు, లబ్బ రుద్రయ్య, తామాడ లోకనాథం, జుత్తు అమ్మినాయుడు, బత్తిన కృష్ణారావు, సిర్ల కృష్ణారావు, జికె నాయుడు, తుంబనాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శిరీష

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పొందూరు: మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంసి చైర్మన్ తమ్మినైన ప్రసాదరావు చేతులమీదుగా శుక్రవారం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యకోసం ట్యాబ్‌లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జి.సాయికుమార్, వైసిపి నాయకులు పైడి పోలయ్య, ఉపాధ్యాయులు గురుగుబెల్లి గోపాలరావు, చౌదరి వేణుగోపాల్, ధవళ పెంటయ్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి .వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు ఎపి మోడల్ స్కూల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి చేతుల మీదుగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ పరిజ్ఞానంతో వారి ఉన్నత చదువులు సాగించడానికి సిఎం జగన్ ఈ టాబ్‌ల పంపిణీ చేపట్టి, విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, పట్టణ వైసిపి అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డి.వైకుంఠరావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పొందూరు : ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న పిఎంసి చైర్మన్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

రణస్థలం: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం మండలం గరికిపాలంలో రణస్థలం, లావేరు మండలాల ఫెన్షన్‌దారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫెన్షనర్లకు ప్రభుత్వం ఆర్థిక బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేస్తుందన్నారు. ప్రభుత్వం వాస్తవాలను పరిశీలించి ఫెన్షన్‌దారులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి ఎన్.వి రమణ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాల్లో పర్యటించి ఫెన్షనర్ల సమస్యలను సేకరించి వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. సమావేశంలో రణస్థలం, లావేరు మండలాల ఫెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పున్నాన నరసింహులు నాయుడు, పాపినాయుడు, బాలి రామనాయుడు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సంతబొమ్మాళి: ఎపి కంట్రిబ్యూటరీ ఫెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోషియేషన్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు ప్రకటించారు. ఎన్నికల అధికారులుగా సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు రెడ్డి సూరిబాబు, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాడాన రాజు ఆధ్వర్యంలో కార్యవర్గఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఆయన తెలిపారు. మండల గౌరవ అధ్యక్షులుగా ప్రవీణ్ కుమార్, గౌరవ సలహాదారుగా గిన్ని అప్పలరాజు, అధ్యక్షులుగా పి.ఫాల్గుణరావు, సహాధ్యక్షులుగా పి.శివాజీ, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా కె.చంద్రుడు, మహిళా అధ్యక్షురాలిగా సిహెచ్ హైమావతి, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శులుగా ఎస్.హరి ప్రసాద్, బాలక చంద్రశేఖర్, ఎ.హరిబాబు, సాధు నరసింహమూర్తి, జిల్లా కౌన్సిలర్‌గా కె.తవిటిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ పాత ఫెన్షన్ పునరుద్దరించే వారికే మా ఓటు అనే నినాదంతో జనవరి 28న చలో విజయవాడ పేరిట భారీర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు కె.పాపారావు, డి.గణపతిరావు, సామ సంజీవరావు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడు మృతి


బాబూరావు (ఫైల్)

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలో సిఎస్‌పి రహదారి నందగిరిపేట వద్ద సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన దళిత యువకుడు మామిడి బాబురావు(28) బస్సు ఢీకొని మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్కూటీపై ఆమదాలవలస వైపు బాబురావు అతడి స్నేహితుడు కలిసి వస్తున్న వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన పాలకొండ ఫైవ్‌స్టార్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో బాబురావు అక్కడికక్కడే మృతి చెందగా అతని స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తల్లిదండ్రులు మామిడి దాలయ్య, రాజు దంపతులు కుమారుడు మరణంతో బోరున విలపించారు. అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే బాబురావు మృతి చెందాడని దళిత సంఘాల నాయకులు బోనెల అప్పారావు, తోట రాము, గుర్రాల చినబాబు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. డ్రైవర్‌ను అరెస్టు చేసి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో కిలోమీటర్ మేర ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ట్రైనీ డిఎస్‌పి, శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగించే విధంగా చర్యలు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.


మద్దతు తెలుపుతున్న జనసేన నాయకుడు రాజేష్

బెంతు ఒరియాలకు రాజేష్ మద్దతు

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేస్తున్న బెంతు ఒరియాలకు జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ సంఘీభావం తెలిపారు. శుక్రవారం రిలే నిరాహారదీక్షల శిబిరానికి చేరుకున్న రాజేష్ వారి సమస్యలు తెలుసుకున్నారు. జనసేన-టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెంతు ఒరియాలకు న్యాయం చేస్తామని హామీఇచ్చారు. ఈ సందర్భంగా బెంతు ఒరియా ప్రతినిధులు మాట్లాడుతూ తమ సమస్యలు శాశ్వితంగా పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. రెండోరోజు దీక్షల్లో సుమన్ బిసాయి, బృందావన్ బిసాయి పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న న్యాయవాదులు

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక బార్ అసోసియేషన్ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూహక్కుచట్టం రద్దు చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా భూహక్కుచట్టం రద్దు కోరుతూ ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అప్పారావు, న్యాయవాదులు రెడ్డి ఉమామహేశ్వరరావు, ఎన్.ఆనందరావు, అరుబోలు ధర్మారావు, ఎస్.హరిబాబు, టి.కృష్ణారావు, సిహెచ్ ప్రసాద్, ఎస్.జానకిరాం, రాజు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌కు తపస్వి ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఈనెల 31 నుంచి జనవరి 5 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం బెతల్‌లో జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీలకు మెండ తపస్వి ఎంపికైందని టెక్కలి క్రీడా వికాస కేంద్రం నిర్వాహకులు నర్సాపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 26 కిలోల విభాగంలో రాష్ట్రం నుంచి పాల్గొన్నట్టు తెలిపారు. తపస్వి ఎన్నిక కావడంతో వికాస కేంద్రం కోచ్ శేఖర్‌తో పాటు డిఎస్‌డిఒ శ్రీధర్ అభినందించారు.


జ్ఞాపికను స్వీకరిస్తున్న జడ్జి సురేష్‌రెడ్డి దంపతులు

హైకోర్టు జడ్జి అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయాన్ని శుక్రవారం ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన సేవల్లో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రాంగణంలో అనివేటి మండపంలో వారికి శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికను అందజేశారు. వారితో పాటు దేవాదాయశాఖ సూపరింటిండెంట్ ప్రసాద్ పట్నాయక్, ఆర్‌డిఒ సిహెచ్ రంగయ్య, 1 టౌన్ ఎస్ఐ గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాలల సముదాయం

టెక్కలి: రెండు రోజులుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల సముదాయం శుక్రవారంతో ముగిసింది. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న స్కూల్‌అసిస్టెంట్లుతో పాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుకు వేర్వేరుగా నిర్వహించిన సమదాయాల్లో పాల్గొన్నారు. హిందీ, ఆంగ్లం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి సముదాయాలు నిర్వహించారు. వీటిని మండల విద్యాశాఖ అధికారులు దల్లి తులసీరావ్ రెడ్డి, చిన్నారావులు పర్యవేక్షించారు.

తలసేమియా రోగికి రక్తదానం

సోంపేట: వరక గ్రామానికి చెందిన తలసేమియా వ్యాధిగ్రస్తుడికి అత్యవసరంగా 'ఒ' నెగటివ్ రక్తం అవసరం కాగా స్థానిక రోటరీ క్లబ్ సభ్యులు స్పందించి రక్తం అందించారు. రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బైరెడ్ల కృష్ణవేణి ఒ నెగిటివ్ రక్తాన్ని అందజేశారు. ఆమెకు రోటరీ సభ్యులతో పాటు పలువరు కృతజ్ఞతలు తెలియజేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా నిలుస్తున్న రోటరీ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో విశ్వేస్, కాళీ, సిసింద్రీ పాల్గొన్నారు.


పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి ప్రవీణ

పెరటికోళ్లు పంపిణీ

ప్రజాశక్తి- పలాస
ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో పెరటికోళ్లు పంపిణీ చేస్తుందని ఎంపిపి ఉంగ ప్రవీణ అన్నారు. మండలంలో 46 మందికి పెరటికోళ్ల యూనిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరటి కోళ్లను పెంచుతూ వాటి ద్వారా వచ్చిన గుడ్లును ప్రతిరోజు మహిళలు, కుటుంబ సభ్యులు ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్. రమేష్ నాయుడు, ఎపిఎం మల్లేశ్వరరావు, మండల సమాఖ్య కోశాధికారి వరలక్ష్మి, సిసిలు రేణుక, నాగమ్మ, వెంకటేశ్వరరావు, అకౌంట్ కళ్యాణి, విఒఎలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మూలగూడ పరిసరాల్లో గజరాజులు

ప్రజాశక్తి - భామిని
మండలంలోని గురువారం సాయంత్రం నాలుగు ఏనుగుల గుంపు గజపతినగరం, కాజ పురం, మూల గూడ పరిసర గ్రామాలలో ప్రవేశించి మామిడి తోటల్లో సంచరించాయి. ఏనుగుల కదలికలు నిరంతర పరిశీలనలో భాగంగా డ్యూటీలో వున్న బీట్ అధికారి లక్ష్మణమూర్తి ద్విచక్ర వాహనం వెనుక భాగాన్ని శు క్రవారం ఏనుగులు తొక్కి ధ్వంసం చేశాయి. ప్రస్తుతం రాత్రిళ్లు ఏనుగులు ఎటువైపు సంచరిస్తాయోనని పరిసర గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వీరఘట్టం
విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కత్తులకవిటి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులకు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యా బోధన చేయాలన్నారు. అలాగే ఎం.రాజపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.దేవరాజు టిఎల్ఎం ప్రజెంట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చాలి

భామిని : మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు జీతం చెల్లిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంఇఒ శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిని అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం కార్మికులు రమాదేవి, సరస్వతి,రజిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం ఎస్ఐగా గోవిందరావు

ప్రజాశక్తి - వీరఘట్టం
వీరఘట్టం ఎస్ఐగా ఎం.గోవిందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన ఎం.వెంకటరమణకు ఎక్కడా పోస్టింగు లభించలేదు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎం గోవిందరావు మాట్లాడుతూ అందరి సహకారంతో శాంతి భద్రతకు భంగం కలగకుండా కృషి చేస్తానన్నారు.

పాఠశాల పనితీరుపై సంతృప్తి

ప్రజాశక్తి- సీతంపేట
మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పనితీరును ఎంఇఒ డి.సూర్యచంద్రమౌళి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ఎంఇఒ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో సంతృప్తి చెందారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. ఎంఇఒ వెంకటరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రజలను జగన్ మోసగించారు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస
సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజలకు 730 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 109 పథకాలు (15 శాతం) మాత్రమే అమలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న సమయంలో 120 సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే వాటిని జగన్మోహన్ రెడ్డి నిలిపి వేశారన్నారు. సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి ఉపాధ్యాయులకు మోసం చేయలేదా అని ప్రశ్నించారు. ప్రతినెల ఒకటోతేది నాటికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి రాబోయే 15 ఏళ్లు తాకట్టు పెట్టేందుకు సిఎం సిగ్గుపడలన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ప్రక్క రాష్ట్రానికి వెళ్లిపోతున్నా సిఎంకు చీమకుట్టినట్టైనా లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, సిఎం నియమించిన వాలంటీర్లు సైతం ధర్నాలు చేస్తుంటే జగన్ పరిపాలన


పోస్టర్లను చూపిస్తున్న శిరీష

ఎలా ఉందో ప్రజలకు అర్థం అవుతుందన్నారు. పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మున్సిపాలిటీకి తాగునీరు అందించలేని స్థితి మున్సిపాలిటీలో ఉందన్నారు. కెటిరోడ్డు పనులు చేపట్టి సుమారు మూడున్నర ఏళ్లు కావస్తున్నా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, ఎస్.నవీన్, అవుగాన దాశరథ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఐఎఎల్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్)వార్షిక కేలండర్, డైరీల ఆవిష్కరణ జరిగింది. ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నాగరాజ్ పాత్రో ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.దేవరాజ్ సమక్షంలో జరిగిన కార్యక్రమానికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. ప్రజలకు అందించే న్యాయసేవల్లో న్యాయవాదులదే కీలకపాత్రన్నారు. కార్యక్రమంలో


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులు ఎన్.రమణయ్య, ఎ.సత్యనారాయణ, ఎం.సోమశేఖర్, ఎస్.ఎల్.నారాయణ, ఎం.రాంబాబు, దక్శత కృష్ణమూర్తి, కె.ప్రసాద్, ఎన్‌విఎస్ రంగారావు, బి.జగ్గారావు, భగవాన్ దాస్, పి.వరలక్ష్మి, ఎ.నారాయణరావు, కాశీ వరప్రసాద్, ఎం.కె.సామంత్, బి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఒరియా మైనార్టీలకు అవకాశం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ పాడి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం
రానున్న ఎన్నికల్లో వైసిపి టిక్కెట్ ఒరియా మైనార్టీలకు ఇస్తే జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో అఖండ విజయం తథ్యమని జిల్లా ఒరియా మైనరిటీ సంఘం అధ్యక్షుడు సత్యా నారాయణ పాడి అన్నారు. స్థానిక ఒరియా బాపూజీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒరియా సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో ఒరియా మైనారిటీ కులాలు లక్షకు పైగా ఉన్నారని, తెలుగు మైనారిటీలు మరో 40వేలు మంది ఉన్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో ఒరియా మైనారిటీలకు అవకాశం ఇస్తే ఒక ఇచ్ఛాపురంతో పాటు పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలు కూడా వైసిపి అఖండ విజయం సాధిస్తుందన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డికి ఒరియా మైనారిటీ కులాల వివరాలు, దాని ప్రభావంపై నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో కార్యదర్శి శివ ప్రసాద్ పండా, బాపూజీ గ్రంథాలయం అధ్యక్షుడు రఘునాథ్ గౌడ్, గుడియా సంఘం అధ్యక్షుడు త్రినాథ్ సాహు, రఘునాథ్ సాహు, కంచ్రా కులపెద్దలు దుభి శ్యామ్ థాస్, నారాయణ బెహారా, రాజేంద్ర పండా, విద్యాధర బెహరా, శ్రీనివాస్ దాస్, కూర బెహరా పాల్గొన్నారు.

మేట్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి
గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మేట్లుదే కీలకపాత్రని, వారి బాధ్యతలు, విధులపై శిక్షణా తరగతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉపాధిహామీ పథకం ఎపిఒ ఎం.అరుణకుమార్ ఆధ్వర్యంలో మేట్లుకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ అరుణకుమార్ మాట్లాడుతూ మండలంలో 38 గ్రామ పంచాయతీల పరిధిలో మేట్లుకు గురువారం, శుక్రవారం శిక్షణ ఇచ్చామని, ఈ శిక్షణా తరగతుల్లో ఉపాధిహామీ వేతనదారులకు కనీస వేతనం


మాట్లాడుతున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు

వచ్చేలా పనిచేయించడం ఎలా అనేదానిపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా ఎన్ఎంఎంఎస్ యాప్ వినియోగం, తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ జెఇ హరిప్రసాద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

మక్కువ: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడికరాజన్నదొర అన్నారు. మండలంలోని డి.సిర్లాంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వం వల్ల కలిగిన మేలును ప్రజలకు వివరించి ప్రభుత్వ పనితీరు గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. జెడ్పిటిసి శ్రీనివాసనాయుడు, సర్పంచ్ కోటేశ్వరరావు, ఎంపిటిసి వాసురెడ్డి అప్పలనాయుడు, వాలంటీర్లు, స్థానికులు మావుడి.రంగునాయుడు పాల్గొన్నారు.


బడ్జెట్ వివరాలు చదువుతున్న ఎంపిడిఒ

పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- కవిటి
అధికారుల సహకారంతో మండలంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. మండల బడ్జెట్ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 2024-25 ఏడాదికి చెందిన ఆదాయ, వ్యయాలు వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, కో-ఆప్షన్ సభ్యులు పాండవ శేఖర్, ఎఎంసి వైస్ ఛైర్మన్ నీలయ్య, ఎంపిటిసిలు పూడి నీలాచలం, దుద్ది సతీష్, చందాన పూర్ణచంద్రరావు, పిరియా కృష్ణారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

హెల్త్ కార్డులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి- పలాస
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువులకు అందిస్తున్న హెల్త్ కార్డులను పంపిణీ చేయాలని పశుసంవర్థకశాఖ ఎడి పోతనపల్లి చంద్రశేఖర్ పశుసంవర్థకశాఖ అధికారులకు సూచించారు. పశుసంవర్థక శాఖ కార్యాలయంలో శు క్రవారం పలాస, మందస మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయాలన్నారు. పశువులకు వేసిన టీకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.శ్రీకాంత్, డాక్టర్ ఉమాభారతి, డాక్టర్.మధుబాబు పాల్గొన్నారు.


ఎంఇఒని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఇఒకి సన్మానం

ప్రజాశక్తి- కవిటి
ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కవిటి ఎంఇఒ ధనుంజయ మజ్జిని మండలంలోని ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లింగరాజు, ప్రసాద్ పట్నాయక్ తదితరులు మాట్లాడుతూ మండలంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ధనుంజయ మజ్జి అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేవని, ఇప్పుడు రాష్ట్ర ఎంఇఒ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు అక్షర కాలేజ్ రోడ్డు వద్ద పవర్ బోర్ షార్ట్ సర్క్యూట్ వలన ప్యానెల్ బోర్డు పూర్తిగా కాలిపోయింది. నీరులేక అక్కడ ప్రజలు ఇబ్బంది పడుతున్నరనే విషయాన్ని వైసిపి నాయకుడు దాసరి శంకరరావు, కౌన్సిలర్ శిష్టు బృందావతి గోపీ దృష్టికి తీసుకురావడంతో తన సొంతనిధులు రూ.4500 ప్యానల్ బోర్డు, పవర్ బోర్డు కొనుగోలు చేసి మున్సిపల్ సిబ్బందితో రిపేర్ చేయించి మంచినీరు అందించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బగాది సింహాచలం, దాసరి శంకరరావు పాల్గొన్నారు.